RNI No: TELTEL/2022/83073

వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:135 | మే 23, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

385 కేజీల గంజాయి పట్టివేత!

- భద్రాద్రిలో వాహన తనిఖీల్లో పట్టుబడ్డ స్మగ్లర్లు
- రెండు కార్లు, ఒక లారీ సీజ్ చేసిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్

2లో

తెలుగు రాష్ట్రాలు

అగ్నిగుండం!

పదేళ్ల రికార్డ్ బ్రేక్!

48 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు

- కూలీలు, రైతులపైనే ఎండల పగ
- పొలాల్లోనే ప్రాణాలు విడుస్తున్న అన్నదాతలు
- పలు జిల్లాల్లో 46 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- వాతావరణ శాఖ రెడ్ అలర్ట్
- ఎండకు తోడైన ఉక్కపోతతో జనం అస్తవ్యస్తం

వడదెబ్బతో ఒకే రోజే 22 మంది మృత్యువాత

2లో

సూర్య ప్రతాపానికి అల్లాడుతున్న జనం

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

తెలుగు రాష్ట్రాలు ప్రస్తుతం అగ్నిగుండాల్లా మారుతున్నాయి. సూర్యుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. గత పదేళ్ల రికార్డులను తిరగరాస్తూ ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరడం, ఉదయం తొమ్మిది దాటితేనే ప్రజలు బయటకు రావడానికి జంకే పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. విపరీతమైన ఉక్కపోతకు తోడు, రాజస్థాన్, మహారాష్ట్రల నుంచి వీస్తున్న పొడిగాలులతో జనజీవనం నరకప్రాయంగా మారింది. దారుణమైన వడగాల్పుల ధాటికి ఒక్క తెలంగాణలోనే ఒకే రోజు 22 మంది అభాగ్యులు, కూలీలు పొలాల్లోనే ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.



అక్రమ ఆస్తుల కేసులో డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్!

11 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు

- కోట్ల విలువైన ప్లాట్లు, ఇళ్లు, ఫామ్ హౌస్ గుర్తింపు
- ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు
- రియల్టర్లతో ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు
- గిఫ్ట్ డీడ్ రూపంలో 10 ప్లాట్ల స్వీకరణ
- మరింత లోతుగా కొనసాగుతున్న విచారణ

2లో

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్యను చంపేశాడు?!

- ఆపై ఉరి వేసుకున్నట్లు చిత్రీకరణ
- ఖమ్మం జిల్లాలో కలకలం రేపిన దారుణ ఘటన
- కోటి రూపాయల పాలసీ కోసం హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- గతంలోనూ భార్యపై దాడులు చేశాడని వెల్లడి
- హత్యా కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభం

2లో

జీతాలు ప్రభుత్వ ఉద్యోగులకి..

స్తంభాలు ఎక్కేది ప్రైవేట్ వ్యక్తులా?!

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి చావుబతుకుల మధ్య నాగేష్

పోక్సో నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడారు

- బాధిత బాలికకు న్యాయం జరగలేదు
- ప్రధాని పర్యటన సాకుగా చెప్పడం సిగ్గుచేటు
- హనీ ట్రాప్ కౌంటర్ కేసులపై విచారణ అవసరం
- నిందితుడికి అధికార అండ ఉంది
- ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే పోరాటం కొనసాగుతుంది
- బండి భగీరథ్ కేసులో ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ ఫైర్

వేద న్యూస్, తెలంగాణ బ్యూరో

పోక్సో కేసులో నిందితుడిని తొమ్మిది రోజుల పాటు దాచి ఉంచిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే నని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మధ్య ఉన్న అనుబంధం వల్లే బాధిత బాలికకు అన్యాయం జరిగిందని విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి వేధించారని ఆరోపించారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయకుండా తొమ్మిది రోజుల పాటు కాపాడింది ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్రంగా స్పందించడంతోనే చివరికి ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితుల్లో అరెస్ట్ చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు బెయిల్ ఇవ్వబోదని స్పష్టం చేసిన తర్వాతే ప్రభుత్వం చర్యలు తీసుకుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి పర్యటన కారణంగా పోలీసులు బిజీగా ఉన్నారు

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

శనివారం | మే 23, 2026

385 కేజీల గంజాయి పట్టివేత!

- భద్రాద్రిలో వాహన తనిఖీల్లో పట్టుబడ్డ స్మగ్లర్లు
- రెండు కార్లు, ఒక లారీ సీజ్ చేసిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్

వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం

గంజాయి అక్రమ రవాణాపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 385 కిలోల గంజాయిని పట్టుకుని అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు కార్లు, ఒక లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడినట్లు పేర్కొన్నారు. గంజాయి రవాణా వెనుక ఉన్న ముఠాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాను కేంద్రంగా చేసుకుని ఇతర ప్రాంతాలకు మత్తు పదార్థాలు తరలిస్తున్న నెట్వర్క్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నామని వెల్లడించారు. అక్రమ మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన తనిఖీలను జిల్లావ్యాప్తంగా మరింత విస్తరించనున్నట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. అనుమానాస్పద కదలికలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా పోలీసులు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్యను చంపేశాడు?!

వేద న్యూస్, ఖమ్మం

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోల్ తండాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను భర్తే హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. హత్య అనంతరం ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించి నిందితుడు పరారైనట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతురాలు మీనాక్షి, భర్త శివాజీ 14 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజ్ సమీపంలోని గోల్ తండాలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. బయటకు సాధారణ కుటుంబంలా కనిపించినా, ఇంట్లో తరచూ గొడవలు జరిగేవని బంధువులు చెబుతున్నారు. ఇటీవల ఇంటిపై సుమారు 80 లక్షల రూపాయల రుణభారం ఉందని, మీనాక్షి పేరుపై కోటి రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ ఉండటంతో డబ్బుల కోసం ఈ హత్య జరిగి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం భార్యను చిత్రహింసలకు గురిచేసి చివరకు హత్య చేశాడని ఆరోపిస్తున్నారు. గతంలో కూడా శివాజీ తన భార్యపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయని బంధువులు తెలిపారు. మీనాక్షిని కిందపడేసి పిడిగుద్దులతో కొట్టిన దృశ్యాలను బయటపెట్టారు. భర్త తరచూ ఆమెను హింసించేవాడని, అతడి ప్రవర్తన దారుణంగా ఉండేదని ఆరోపిస్తున్నారు. కుటుంబ కలహాల పేరుతో సంవత్సరాలుగా ఆమె మానసిక, శారీరక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మీనాక్షి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, భర్త శివాజీ ఆమె ఉరివేసుకొని చనిపోయినట్లు చిత్రీకరించి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే ఈ హత్య జరిగిందా లేదా మరేదైనా వ్యక్తిగత కారణం ఉందా అనే దానిపై సమగ్ర విచారణ జరపాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనతో గోల్ తండాలో విషాద వాతావరణం నెలకొంది.

పోక్సో నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడారు

మొదటి పేజీ తరువాయి

అని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి వస్తే మూడు రోజుల పాటు నేరస్థులు స్వేచ్ఛగా తిరగాలా? అని ప్రశ్నించారు. రాష్ట్ర హోంశాఖకు బాధ్యుడైన ముఖ్యమంత్రి ఇలాంటి సాకులు చెప్పడం బాధాకరమన్నారు. పోక్సో కేసు వంటి సున్నితమైన అంశంపై తాము ఇప్పటి వరకు రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేయడంతో స్పందించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడైనా పోక్సో కేసు నిందితుడు తొమ్మిది రోజుల పాటు తప్పించుకొని తిరిగిన ఉదాహరణ ఉందా అని ప్రశ్నించారు. కేవలం అధికార అండదండల వల్లే నిందితుడు తప్పించుకున్నాడని ఆరోపించారు. బాధిత కుటుంబంపై హనీ ట్రాప్ పేరుతో కౌంటర్ కేసులు పెట్టడం వెనుక ఎవరు ఉన్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సన్నిహితుల ఆసుపత్రిలో నిందితుడిని దాచిపెట్టారనే వార్తలపై విచారణ జరపాలని కోరారు. ఒకవైపు తన కుమారుడికి సంబంధం లేదని కోర్టులో చెప్పి, మరోవైపు తానే పోలీసులకు అప్పగించానని చెప్పడం ఎలా సాధ్యమో బండి సంజయ్ సమాధానం చెప్పాలని అన్నారు.

జీతాలు ప్రభుత్వ ఉద్యోగులకి..

స్తంభాలు ఎక్కేది ప్రైవేట్ వ్యక్తులా?!

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి చావుబతుకుల మధ్య నాగేష్

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగేష్

వేద న్యూస్, నిజామాబాద్

తరచూ ఎక్కడో ఒకచోట విద్యుత్ ఘాతానికి అభాగ్యులు బలవుతున్నా, విద్యుత్ శాఖ అధికారులలో మాత్రం చలనం రావడం లేదు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని గోవిందపల్లి గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక పేద కుటుంబం వీధిన పడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ లక్షల రూపాయల జీతాలు తీసుకుంటున్న అధికారులు.. ప్రాణాంతకమైన పనులను చేయడానికి ప్రైవేట్ వ్యక్తులను హెల్పర్లుగా వాడుకుంటూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా ధర్పల్లి మండలం లైన్మెన్ ప్రవీణ్ చేసిన నిర్లక్ష్యపు పనికి కనకం నాగేష్ అనే యువకుడు ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

- ఎల్సీ ఇచ్చి కరెంట్ వదిలిన లైన్మెన్
- యశోద ఆసుపత్రిలో బాధితుడికి చికిత్స.. రోజుకు లక్షల్లో బిల్లు..
- ఏడాది పాపతో రోడ్డున పడ్డ అభాగ్యురాలు
- భర్త ప్రాణాలు కాపాడాలంటూ భార్య లక్ష్మణ కన్నీటి విజ్ఞప్తి
- అధికారుల నిర్లక్ష్యానికి గ్రామస్తుల ఆగ్రహం
- ధర్పల్లి సబ్ స్టేషన్ ముట్టడి.. రోడ్డుపై బైఠాయింపు
- లైన్మెన్ నిర్లక్ష్యం.. గతంలోనూ ముగ్గురు బలి
- కింది స్థాయి సిబ్బంది తప్పలను కప్పిపుచ్చుతున్న ఏఈ
- 'చిన్న సంఘటనే' అంటూ నిర్లక్ష్యపు సమాధానం

ఎల్సీ ఇచ్చి కరెంట్ వదిలారు

గ్రామంలోని విద్యుత్ సమస్యను సరిచేయడానికి లైన్మెన్ ప్రవీణ్ ఎల్సీ (లైన్ క్లియరెన్స్) ఇచ్చినట్లే ఇచ్చి, ఆ తర్వాత నిర్లక్ష్యంగా మరల కరెంటు సరఫరాను పునరుద్ధరించాడు. లైన్మెన్ ఎల్సీ ఇచ్చాడనే భరోసాతో నాగేష్ కరెంటు స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, ఒక్కసారిగా హైవోల్టేజ్ కరెంట్ సరఫరా కావడంతో స్తంభంపైనే విద్యుత్ ఘాతానికి గురై కింద కుప్పకూలాడు. నాగేష్‌తో పాటు ఉన్న కర్రోల్ల శ్రీనివాస్ వెంటనే స్పందించి ఆయన్ను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.

సబ్ స్టేషన్ ముట్టడి.. బయటపడ్డ బండారం

ఈ దారుణ ఘటనతో ఆగ్రహానికి గురైన గోవింద్ పల్లి గ్రామస్తులు రాత్రికి రాత్రే ధర్పల్లి సబ్ స్టేషన్‌ను ముట్టడించి, రోడ్డుపై బైఠాయించారు. సబ్ స్టేషన్‌లో విచారించగా దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ ఆపరేటర్‌గా విధులు నిర్వహించాల్సిన వ్యక్తి లేకపోగా, కనీస అర్హత లేని కిరణ్ అనే వాచ్‌మెన్‌ను ఆపరేటర్‌గా కూర్చోబెట్టారు. లైన్మెన్ ప్రవీణ్ అందుబాటులో లేకపోవడంతో, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ వ్యక్తికి ఎల్సీ ఇచ్చినట్లు బహిరంగంగా ఒప్పుకోవడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. గతంలోనూ ఇదే లైన్మెన్ నిర్లక్ష్యం వల్ల ముగ్గురు వ్యక్తులు చనిపోయారని, ప్రైవేట్ హెల్పర్ గంగయ్య అనే వ్యక్తి కూడా గతంలో ఇలాగే తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల వల్లే ఘోరం

గ్రామస్తులు న్యాయం కోసం నిలదీయగా, ధర్పల్లి విద్యుత్ శాఖ ఏఈ రూప్ సాయి బాధ్యతారహితంగా మాట్లాడారు. ఇంత చిన్న సంఘటనను ఇంత పెద్దది చేయడం ఏంటి? అంటూ బాధితులపైనే వాగ్వాదానికి దిగడం ఆయన కింది స్థాయి సిబ్బంది తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలకు తావిస్తోంది. నిర్లక్ష్యానికి కారణమైన ఏఈ రూప్ సాయి, లైన్మెన్ ప్రవీణ్ కుమార్, వాచ్‌మెన్ కిరణ్‌లను వెంటనే విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రూపాయి లేని పేద కుటుంబం..

విద్యుత్ శాఖ పాపానికి ఒక పేద కుటుంబం సర్వస్వం కోల్పోయే స్థితికి చేరింది. ప్రమాదానికి గురైన కనకం నాగేష్‌కు భార్య లక్ష్మణ, ఒక సంవత్సరపు చిన్న పాప ఉన్నారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కుటుంబం కావడంతో ప్రస్తుతం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో రోజుకు ఒక లక్ష రూపాయలకు పైగా అవుతున్న వైద్య ఖర్చులను భరించలేక కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే తప్పు చేసిన సిబ్బందిని సస్పెండ్ చేయాలని, నాగేష్ కుటుంబానికి పూర్తి వైద్య ఖర్చులు అందించి న్యాయం చేయాలని గోవింద్ పల్లి గ్రామస్తులు, బాధితుడి కుటుంబ సభ్యులు దీనంగా వేడుకుంటున్నారు.

అగ్నిగుండం!

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

తెలుగు రాష్ట్రాలు ప్రస్తుతం నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు జిల్లాలు అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నాయి. ఉదయం తొమ్మిది దాటితే చాలు బయట అడుగు పెట్టాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఎండల తీవ్రతకు తోడు విపరీతమైన ఉక్కపోత తోడవ్వడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థల హెచ్చరికలతో ఉభయ రాష్ట్రాల అధికారులు అప్రమత్తమయ్యారు. రానున్న రోజుల్లో కూడా వేడి తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రికార్డులు బద్దలు కొడుతున్న ఉష్ణోగ్రతలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కాపురం పరిధిలోని నందనమారెళ్లలో 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఏపీలోని దాదాపు 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఇటు తెలంగాణలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీలు నమోదు కాగా, హనుమకొండ జిల్లా ధర్మసాగర్, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కాగా, పలుచోట్ల అనధికారికంగా 50 డిగ్రీలు ఉంటోందని నిపుణులు చెబుతున్నారు.

పదేళ్ల రికార్డులు కనుమరుగు..

సూర్యుడి ఉగ్రరూపంతో తెలంగాణలో పలుచోట్ల గత పదేళ్ల మే నెల ఉష్ణోగ్రత రికార్డులు బద్దలయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2019 మేలో నమోదైన 46.3 డిగ్రీల రికార్డును దిలావర్‌పూర్ (46.5 డిగ్రీలు) అధిగమించింది. హనుమకొండ జిల్లాలో 2017 రికార్డును తాజా ఉష్ణోగ్రతలు దాటేశాయి. మహారాష్ట్ర, రాజస్థాన్‌ల నుంచి తెలంగాణకు పొడిగాలులు వస్తుండటంతో గాలిలో తేమ పడిపోయి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయని వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో తీవ్రమైన వడగాలులపై ఇప్పటికే ఎర్ర హెచ్చరికలు (రెడ్ అలర్ట్) జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మునుపెన్నడూ లేనంతగా 244 మండలాల్లో వడగాలులు వీచాయి.

పొలాల్లోనే ప్రాణాలు వదులుతున్న కూలీలు

ప్రస్తుత వడగాల్పుల తీవ్రతకు వడదెబ్బ తగిలి ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 22 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొమ్మిది మంది ఉన్నారు. మరణించిన వారిలో రైతులు, ఉపాధి హామీ కూలీలు, దివ్యాంగులు అధికంగా ఉన్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన రైతు సామ లచ్చిరెడ్డి, కనుకుంట్ల కనకయ్య, కరీంనగర్ జిల్లాకు చెందిన దివ్యాంగుడు గాజర్ల సతీష్, ఉపాధి హామీ కూలీ శ్రీపతి లక్ష్మీ ఎండ దెబ్బకు బలయ్యారు. అలాగే సూర్యాపేట, జనగామ, ములుగు, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో పలువురు రైతులు, వ్యవసాయ కూలీలు వడదెబ్బతో మృతి చెందారు.

అప్రమత్తమైన ప్రభుత్వం..

రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వడగాల్పుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు వీలైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయవద్దని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ కోరింది.

అక్రమ ఆస్తుల కేసులో డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్!

11 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు

- కోట్ల విలువైన ప్లాట్లు, ఇళ్లు, ఫామ్ హౌస్ గుర్తింపు
- ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు
- రియల్టర్లతో ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు
- గిఫ్ట్ డీడ్ రూపంలో 10 ప్లాట్ల స్వీకరణ
- మరింత లోతుగా కొనసాగుతున్న విచారణ

వేద న్యూస్, హైదరాబాద్

మేడ్చల్-మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను అక్రమ ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. వంశీమోహన్‌కు చెందిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అధికారులు గుర్తించినట్లు సమాచారం. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ.1.2 కోట్ల విలువైన మూడు ఇళ్లు గుర్తించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని నారపల్లి వద్ద రెండు ఎకరాల్లో నిర్మించిన ఫామ్ హౌస్ కూడా ఉన్నట్లు వెల్లడించారు. శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురం ప్రాంతాల్లో సుమారు ఎనిమిది ఎకరాల భూమి ఆక్రమణపై కూడా విచారణ కొనసాగుతోంది. ఒక రియల్టర్ నుంచి గిఫ్ట్ డీడ్ రూపంలో 10 ప్లాట్లు తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. ప్రభుత్వ పదవిని దుర్వినియోగం చేసి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో వంశీమోహన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర అనుబంధ అంశాలపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ తెలిపింది.

వేద న్యూస్

శనివారం మే 23 , 2026

ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- రైతులు అధైర్యపడొద్దు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వేద న్యూస్, గొల్లపల్లి:

వరి, మొక్కజొన్న పండించిన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు బోరుబావిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో జగిత్యాల జిల్లాలో పెద్ద మొత్తంలో వరి, మొక్కజొన్న దిగుబడులు వచ్చాయని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వెల్లడించారు. మిగిలిన ధాన్యం సేకరణపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని, సమస్యల నుంచి పారిపోయే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. తిరుమలాపూర్ గ్రామ రైతులు ఐక్యతతో సొసైటీ ఏర్పాటు చేసుకుని, కొనుగోలు కేంద్రం కోసం సమిష్టిగా నిధులు సేకరించి స్థలం కొనుగోలు చేయడం అభినందనీయమని కొనియాడారు. గ్రామ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- రాష్ట్రంలో 6వ స్థానంలో జగిత్యాల జిల్లా
- గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగిన కొనుగోళ్లు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వేద న్యూస్, జగిత్యాల:

రానున్న 15 రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లో అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 2.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వచ్చే 15 రోజుల్లో పూర్తిగా సేకరించాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే కొనుగోళ్లు నాలుగు రెట్లు పెరిగాయని తెలిపారు. ఏపీ రైతులు కూడా ఇక్కడే పంట అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నిల్వ సమస్య తలెత్తడంతో అదనపు ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వేద న్యూస్, పరకాల:

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల టౌన్, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల 27 వేల 750 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు బీమా, గ్యాస్ సబ్సిడీ తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుడి కుటుంబానికి నాగూర్ల పరామర్శ

- ప్రవీణ్ చిత్రపటానికి నివాళులు

వేద న్యూస్, నడికూడ:

హనుమకొండ జిల్లా నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన రైతు రక్షణ సమితి నాయకులు సూరావు బాపూరావు కుమారుడు ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం డిప్యూటీ సీఈఓ బాధ్యతల స్వీకరణ

వేద న్యూస్, కారేపల్లి:

సింగరేణి మండల ఎంపీడీవోగా పనిచేసిన పొన్నూరు శ్రీనివాసరావు పదోన్నతిపై ఖమ్మం జిల్లా డిప్యూటీ సీఈఓగా నియమితులై శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో సింగరేణి మండల సర్పంచ్‌ల సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో ఎంపీడీవోగా పనిచేసిన సమయంలో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రీనివాసరావు చూపిన కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పొన్నూరు శ్రీనివాసరావు తెలిపారు.

తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో అవకతవకాలపై బీజేపీ ధర్నా
- తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పణ

వేద న్యూస్, మెట్‌పల్లి:

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో గోనె సంచులు, రవాణా వాహనాలు లేకపోవడంతో పాటు తరుగు పేరుతో క్వింటాల్‌కు 3 నుంచి 5 కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అవసరమైన సదుపాయాలు కల్పించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.

ప్రమాదకర మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు

- వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి – సీఐ రవీందర్ సూచన

వేద న్యూస్, కోనరావుపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ పరిధిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో ఉన్న ప్రమాదకర మలుపు వద్ద కోనరావుపేట పోలీసులు హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఆదేశాల మేరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు చందుర్తి సర్కిల్ సీఐ రవీందర్ తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో పలు రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ వాహనదారులు మలుపు ప్రాంతంలో నెమ్మదిగా ప్రయాణిస్తూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్లచిట్టాపూర్ శివారులో భారీ అగ్నిప్రమాదం

- 2వేల ఈత చెట్లు దగ్ధం.. లక్షల్లో ఆస్తి నష్టం
- కాలిబూడిదైన బోర్‌వెల్, పైప్‌లైన్లు, విద్యుత్ వైర్లు

వేద న్యూస్, మెట్‌పల్లి:

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామ శివారులో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో సుమారు 2000 ఈత చెట్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. తోటలోని బోర్‌వెల్, పైప్‌లైన్లు, విద్యుత్ వైర్లు కూడా మంటల్లో దగ్ధమయ్యాయి. దీంతో రైతుకు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం.ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు, గీత కార్మికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలు మరింత వ్యాపించకుండా తీవ్రంగా శ్రమించి అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. తమ జీవనాధారమైన ఈత వనం కాలిపోవడంతో గీత కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

ఐస్‌క్రీమ్ బండి వస్తే రూ.5 వేల జరిమానా

- పిల్లల ఆరోగ్య రక్షణకు వెనుగుమట్ల గ్రామం కీలక నిర్ణయం

వేద న్యూస్, గొల్లపల్లి:

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామంలో పిల్లల ఆరోగ్య రక్షణ కోసం గ్రామ పంచాయితీ సంచలన నిర్ణయం తీసుకుంది. గ్రామంలోకి ఐస్‌క్రీమ్ ఆటోలు, నెట్టుడు బండ్ల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధిస్తూ తీర్మానం చేసింది. నిబంధనలు ఉల్లంఘించి గ్రామంలో ఐస్‌క్రీమ్‌లు అమ్మితే రూ.5 వేల జరిమానా విధిస్తామని గ్రామ శివార్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కల్తీ, నాణ్యతలేని ఐస్‌క్రీమ్‌ల వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. జలుబు, దగ్గు, వాంతులు, దంత సమస్యలతో పాటు దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

వేద న్యూస్

శనివారం మే 23 , 2026

బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

- వార్డు మెంబర్ అక్షయ్ కుమార్

వేద న్యూస్, మంచిర్యాల జిల్లా:

చింతగూడ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో "మన ఊరుమన బడి, ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ మేకల అక్షయ్ కుమార్ పాల్గొని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటి సౌకర్యాలు ఉచితంగా అందుతున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు తల్లిదండ్రులపై ఫీజుల భారం తగ్గుతుందని వివరించారు. భవిష్యత్తులో ఉన్నత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అవకాశాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత కృషి చేస్తామని మేకల అక్షయ్ కుమార్ తెలిపారు.

అక్రమ మట్టి రవాణాపై ఉక్కుపాదం

- 19 కేసులు నమోదు.. 45 వాహనాలు సీజ్

- అనుమతిలేని మట్టి తరలింపుపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ మహేష్ బి. గితే

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:

జిల్లాలో అక్రమ మట్టి రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అక్రమ మట్టి రవాణాకు సంబంధించి 19 కేసులు నమోదు చేసి 45 వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సీజ్ చేసిన వాహనాల్లో 27 ట్రాక్టర్లు, 11 టిప్పర్లు, 7 జేసీబీలు ఉన్నాయని తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా, నిల్వలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వారం రోజులలో తంగళ్లపల్లి, వేములవాడ టౌన్, బోయినపల్లి, రుద్రంగి, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదు చేసి పలువురు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మట్టిని తవ్వడం లేదా రవాణా చేయాలంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- నేర నియంత్రణకు ఎంతో ఉపయోగపడతాయి - సీఐ సుధాకర్ రెడ్డి

వేద న్యూస్, శాయంపేట:

ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ జక్కుల పరమేష్ సూచించారు. గురువారం పెద్దకోడేపాక గ్రామంలో గ్రామ సర్పంచ్ మంద దీన, గ్రామ పాలకవర్గం సహకారంతో రూ.25 వేల విలువైన నాలుగు సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. ఇళ్ల పరిసర ప్రాంతాలపై పూర్తిస్థాయి నిఘా ఉండటంతో భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ తహసీల్దార్‌కు రైతు రక్షణ సమితి వినతి

వేద న్యూస్, నడికూడ:

వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గన్నీ సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట అమ్ముకోవడానికి రెండు నెలలా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై దావ వసంత సురేష్ విమర్శలు

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులపై ఆగ్రహం

వేద న్యూస్, జగిత్యాల రూరల్ / సారంగాపూర్:

రైతులు నాలుగు నెలలు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలలు పడుతోందని జగిత్యాల తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. శుక్రవారం గుల్లపేట, ఆర్పెల్లి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచుల కొరత, లారీ రవాణా సమస్యలతో ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోందన్నారు. కేసీఆర్ హయాంలో ఈ సమయానికి కొనుగోళ్లు పూర్తయ్యేవని, ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

బీడీ కార్మికులందరికీ రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలి

- చేయూత పథకం అమలు చేయాలి

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీడీ కార్మికుల ఆందోళన

వేద న్యూస్, రుద్రూర్:

బీడీ కార్మికులందరికీ చేయూత పథకం ద్వారా రూ.4 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రుద్రూర్ మండల కేంద్రంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అంగడి బజారు నుంచి సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయం వరకు ర్యాలీగా వచ్చిన కార్మికులు, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కట్‌ఆఫ్ తేదీ ఆంక్షలు తొలగించి అర్హులైన ప్రతి బీడీ కార్మికురాలికి చేయూత పథకం కింద రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బీడీ కార్మికులను కూడా చేర్చాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వ్యక్తిగత దరఖాస్తులను కార్యాలయ సిబ్బంది స్వీకరించకపోవడంతో

కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం అధికారులు ఫారాలను తీసుకోవడానికి అంగీకరించడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఈత సరదాకు రెండు ప్రాణాలు బలి

- మిడ్ మానేర్‌లో విషాదం..

- ఇద్దరు ఇంటర్ విద్యార్థుల మృతి

- స్నేహితుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన మరో యువకుడు

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు. శుక్రవారం ఉదయం ఐదుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు మిడ్ మానేర్ వద్ద ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరిలో సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన హరిచరణ్ గౌడ్ (18), చిర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన మణికంఠ (17) నీటిలో మునిగి మృతి చెందారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మణికంఠకు ఈత రాకపోవడంతో నీటిలో కొట్టుకుపోతుండగా, అతడిని కాపాడేందుకు హరిచరణ్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన ముగ్గురు యువకులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీల రూపురేఖలు మారుస్తాం

- జిల్లాస్థాయి సమావేశంలో చైర్‌పర్సన్ నాగలక్ష్మి

- మంత్రి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో అభివృద్ధి పనుల సమీక్ష

వేదన్యూస్, జగిత్యాల:

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ మంత్రి సహకారంతో ధర్మపురి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం మే 23 , 2026

రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన

- నడికూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

వేద న్యూస్, నడికూడ:

నడికూడ మండల కేంద్రంలో శుక్రవారం రైతులకు వానాకాలం సాగుపై అవగాహన కల్పించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ కళాశాల వరంగల్, హనుమకొండ జిల్లా నడికూడ మండల వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎన్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ వరిలో కొత్త రకాలు, నేరుగా విత్తే పద్ధతులు, యూరియా వినియోగం తగ్గింపు వంటి అంశాలపై రైతులకు సూచనలు చేశారు. పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలిపి దున్నాలని, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూసారం పెంచుకోవచ్చని వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రవళి మాట్లాడుతూ రసాయనాల వినియోగం తగ్గించి ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని అవసరానికి అనుగుణంగా ఎరువులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

సిటీ కాలేజీకి జాతీయస్థాయి గుర్తింపు

- 'ప్లాటినమ్ సస్టైనబుల్ క్యాంపస్ పార్టనర్' అవార్డు
- పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రశంస

వేద న్యూస్, హైదరాబాద్:

పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రభుత్వ సిటీ కాలేజీకి 'ప్లాటినమ్ సస్టైనబుల్ క్యాంపస్ పార్టనర్' జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. ప్రసాద్ తెలిపారు. రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన 'భారత్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ - జాతీయ సుస్థిర క్యాంపస్ మిషన్ 2026'లో భాగంగా ఈ అవార్డును ప్రకటించారు. గత ఏప్రిల్‌లో నిర్వహించిన ధరిత్రి వారోత్సవాల సందర్భంగా కాలేజీలో మొక్కలు నాటడం, నీటి పొదుపు, పరిశుభ్రత, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు ఈ గుర్తింపు లభించింది. జూన్ 1న గచ్చిబౌలిలో జరిగే 'సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్ & అవార్డ్స్ 2026' కార్యక్రమానికి కాలేజీకి ఆహ్వానం అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. నాగరాజు, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

వేతన పెంపు హర్షణీయం

- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

వేద న్యూస్, పాపన్నపేట:

రాష్ట్రంలోని 1.11 కోట్ల మందికి పైగా కార్మికులకు మేలు చేసేలా ప్రభుత్వం తీసుకున్న వేతనాల పెంపు నిర్ణయం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చిత్రపటాలకు కార్మికులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

- ఏడుపాయల చెక్‌డ్యాం వద్ద విషాదం

వేద న్యూస్, పాపన్నపేట:

ఏడుపాయల చెక్‌డ్యాం సమీపంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నవాబ్‌పేట గ్రామానికి చెందిన కంకరి నాగరాజు (31)కు అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుండేది. అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వచ్చిన ఆయన, చెక్‌డ్యాం సమీపంలో స్నానం చేసేందుకు నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. కొంతసేపటి తర్వాత అటుగా వెళ్లిన స్థానికులు ఒడ్డుపై ఉన్న చెప్పులు, బట్టలు, ఫోన్‌ను గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వేద న్యూస్, చిన్నచింతకుంట:

చిన్నచింతకుంట మండల పరిధిలోని ధమగ్నాపూర్ గ్రామ సమీపంలో ఈ నెల 13న బొలెరో వాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ పిల్లి కొండన్న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ సర్పంచ్ ఈసం చంద్రకళ వెంకట్ రాములు గౌడ్ కుమారులు మురళి గౌడ్, ఈశ్వర్ గౌడ్, రవీందర్ గౌడ్, రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మృతుడి భార్యకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కొండన్న కుటుంబానికి భగవంతుని కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి
- సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

వేద న్యూస్, ధర్మపురి:

ధర్మపురి పట్టణంలోని 8వ వార్డులో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందన్నారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, స్థానిక కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వేసవిలో మూగజీవాల కష్టాలు

- నిరుపయోగంగా మారిన నీటి తొట్టెలు
- మూగజీవాల దాహార్తి తీర్చాలని ప్రజల విజ్ఞప్తి

వేద న్యూస్, పెద్దపల్లి:

వేసవి తీవ్రతతో మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద అడవులు, గ్రామాల సమీపంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయని పేర్కొంటున్నారు. పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాల్లో లక్షల రూపాయలతో నిర్మించిన నీటి కొళాయిల్లో ప్రస్తుతం చుక్క నీరు కూడా లేకపోవడంతో అవి కేవలం సిమెంట్ కట్టడాలుగా మిగిలిపోయాయని అంటున్నారు. ఎండల తీవ్రతతో వాగులు, గుంటలు ఎండిపోవడంతో అడవి జంతువులు, మేతకు వెళ్లే పశువులు నీటి కోసం అల్లాడుతున్నాయని పశువుల కాపరులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల్లో నీరు నింపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దళిత కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారం

- చెట్లు, ముళ్లకంపలు తొలగించి కరెంట్ పునరుద్ధరణ

వేద న్యూస్, మరిపెడ:

మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 10, 11 వార్డుల దళిత కాలనీలో ప్రతిరోజూ రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై పలుమార్లు లైన్‌మెన్‌లకు వినతులు అందజేసినా స్పందన లేకపోయిందని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో 11వ వార్డు కౌన్సిలర్ సత్యవతి యుగంధర్ ఆధ్వర్యంలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లు, ముళ్లకంపలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సహకరించిన ఏడీఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై సమస్యలు వచ్చిన వెంటనే లైన్‌మెన్‌లు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఏడేలి పరశురాం, సైదులు, నరేష్, అశోక్, వెంకటేష్, సురేష్, ఏటీఎం కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

– వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:

కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్), సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశించింది. రైల్వే లైన్ నిర్మాణం, భూ సేకరణ తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశ్రమలు, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కె.ఎస్.బి కుమారి, ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, జిల్లా ఖజానా శాఖ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో మట్టి దందా!

– ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు
– ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా రవాణా
– వెంకటోనిపల్లి పరిసరాల్లో మట్టి మాఫియా ఆగడాలు

వేద న్యూస్, జోగులాంబ గద్వాల:

గద్వాల మండలం వెంకటోనిపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు వ్యక్తులు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పగలు, రాత్రి వేళల్లో భారీగా మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని చెబుతున్నారు. వెంకటోనిపల్లి గ్రామం నుంచి జమ్మిచేడు మేళచెరువు రోడ్డుమార్గంలో పిల్లిగుండ్ల మీదుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూమిని కొల్లగొడుతూ మట్టి మాఫియా దందా కొనసాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అక్రమ మట్టి రవాణాపై వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ ఎదుర్కొంటున్న అధికారులను బదిలీ చేయాలి

– ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్

వేద న్యూస్, కరీంనగర్:

మహిళా శిశు సంక్షేమ శాఖలో ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ డిమాండ్ చేశారు. వరంగల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో ఇటీవల ఏసీబీ దాడులు, విచారణలు జరుగుతున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో జిల్లా సంక్షేమ అధికారి సహా పలువురు అధికారులపై కూడా ఏసీబీ విచారణ కొనసాగుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత అధికారులను అదే స్థానంలో కొనసాగించడం వల్ల సాక్ష్యాధారాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని ఆరోపించారు. శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఒత్తిడి, వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్న ఆయన, గతంలో పలువురు ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. వేధింపులు భరించలేక కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా సంక్షేమ అధికారిపై గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఏసీబీ విచారణను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులను వెంటనే బదిలీ చేయాలని, శాఖ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తిర్మన్‌పల్లిలో భారీ చోరీ

– 7.5 తులాల బంగారం.. 26 తులాల వెండి అపహరణ
– రెండు ఇళ్లలో తాళాలు పగులగొట్టిన దొంగలు

వేద న్యూస్, ఇందల్వాయి:

ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఇద్దరి ఇళ్లలోకి చొరబడిన గుర్తుతెలియని దుండగులు బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు పెద్ద రాజన్న (55), తాటిపాముల శ్రీనివాస్ గౌడ్ ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. బాధితులు ఇంట్లో లేని సమయంలో తలుపుల గడియలు కత్తిరించి లోపలికి ప్రవేశించిన దుండగులు, బీరువాలు పగులగొట్టి అందులోని సొత్తును దోచుకెళ్లారు. ఈ ఘటనలో 7.5 తులాల బంగారం, 26 తులాల వెండి ఆభరణాలతో పాటు నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. ఫిర్యాదు మేరకు ఇందల్వాయి ఎస్సై సందీప్ కేసు నమోదు చేసి, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చర్చలు విఫలమైతే సమ్మెకు సిద్ధం కావాలి

– రెడ్డి బీడీ ఫ్యాక్టరీలో గేట్ మీటింగ్ నిర్వహించిన టీయూసీఐ నాయకులు

వేద న్యూస్, చిన్నచింతకుంట:

చిన్నచింతకుంట మండల కేంద్రంలోని రెడ్డి బీడీ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ నాయకులు మాట్లాడుతూ.. 2026 ఏప్రిల్ 1 నుంచి పెరగాల్సిన బీడీ కార్మికుల వేతనాలు ఇప్పటికీ ఖరారు కాకపోవడం బాధాకరమన్నారు. చర్చల ప్రక్రియను యజమాన్యాలు పదేపదే వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 21న జరగాల్సిన చర్చలను 25వ తేదీకి వాయిదా వేయడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పుపట్టాయి. నిజామాబాద్ ప్రాంతంలో బీడీ కూలీ రూ.275.23 చెల్లిస్తుండగా, ఈ ప్రాంతంలో కేవలం రూ.230 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. గత చర్చల్లో రూ.10 మాత్రమే పెంచుతామని యజమాన్యాలు ప్రతిపాదించగా, దానిని అన్ని కార్మిక సంఘాలు తిరస్కరించాయని తెలిపారు. కార్మికులకు న్యాయమైన, జీవనోపాధికి సరిపడే వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యజమాన్యాలు సరైన వేతనాలు పెంచకపోతే కార్మిక సంఘాలు ఇచ్చే సమ్మె పిలుపుకు అందరూ మద్దతు ఇవ్వాలని నాయకులు కోరగా, కార్మికులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే. సూర్యం, నాయకులు జేఎన్, దేవదానం, కోళ్ల వెంకటన్న, గుండన్న, అడివన్న, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం.. వ్యక్తిపై దాడి

– కట్టెలు, రాళ్లతో హత్యాయత్నం చేశారంటూ ఆరోపణలు
– సంకాపురంలో ఉద్రిక్త పరిస్థితులు

వేద న్యూస్, జోగులాంబ గద్వాల:

అయిజ మండలం సంకాపురం గ్రామంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన కటికె బడేసాబ్‌పై కొందరు వ్యక్తులు కట్టెలు, రాళ్లు, మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని బాధితుడు ఆరోపించాడు. బాధితుడి వివరాల ప్రకారం.. తన పొలానికి వెళ్లే దారిలో గుంత తవ్వి అడ్డంకులు సృష్టించడంతో పాటు, సుమారు 30 గుంటల భూమిని అక్రమంగా కబ్జా చేసి కంచె స్తంభాలు పాతుతున్నారని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నించగా బీఆర్ఎస్‌వీ కురువ పల్లయ్యతో పాటు అతని సోదరులు ఆగ్రహానికి గురై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

దగ్ధమైన ఈత వనం పరిశీలన

– తక్షణ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

వేద న్యూస్, జగిత్యాల రూరల్:

జగిత్యాల రూరల్ మండలం నర్సింగపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు దగ్ధమైన ఈత వనాన్ని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఉపాధి కోల్పోయి ఆవేదనలో ఉన్న గీత కార్మికులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. గౌడన్నల జీవనాధారమైన ఈత వనం అగ్నికి ఆహుతి కావడం బాధాకరమన్నారు. కష్టపడి పెంచుకున్న చెట్లు కాలిపోవడంతో గీత కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు వెంటనే నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ రావు, మహేష్, మల్లేష్ గౌడ్, గంగారెడ్డి, వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో చలివేంద్రం ప్రారంభం

వేద న్యూస్, ధర్మపురి:

ధర్మపురి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు, బాటసారుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించడం గొప్ప సేవా కార్యక్రమమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం కంటే గొప్ప సేవ లేదు. ఇలాంటి కార్యక్రమాలకు మున్సిపాలిటీ తరపున ఎల్లప్పుడూ సహకారం ఉంటుంది అని వేముల నాగలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, సొసైటీ అధ్యక్షుడు జహంగీర్, సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం మే 23 , 2026

ప్రజల భాగస్వామ్యంతోనే జిల్లా అభివృద్ధి

వేద న్యూస్ జనగామ :

అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం 99 రోజుల "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన ఫలితాలు అందిస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కేవలం పరిపాలనా కార్యక్రమం కాదని, ప్రజాస్వామ్య పాలనకు ఆచరణాత్మక రూపమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను నేరుగా తెలుసుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైతు ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక భారం తగ్గించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాల ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. జిల్లాలో అమలవుతున్న పథకాల పురోగతిని అధికారులు వివరించారు. యాసంగి పంట కాలానికి సంబంధించి 1,85,504 మంది రైతులకు రూ.152 కోట్లకు పైగా రైతు భరోసా నిధులు జమ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 5.64 లక్షల మందికి పైగా రేషన్ బియ్యం అందుతోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 97 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందుతోందని తెలిపారు. అలాగే జిల్లాలో 74 వేల మందికి పైగా వృద్ధులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులకు ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో మొదటి విడతలో 5652 ఇళ్లు మంజూరై, వాటిలో 94 శాతం గ్రౌండింగ్ పూర్తి కావడం రాష్ట్రంలో రెండో స్థానమని అధికారులు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికే రూ.155 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ.58 కోట్లకు పైగా బ్యాంకు లింకేజ్ చెక్కులు అందజేశారు. మహిళా సంఘాలకు ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఆర్థిక సహాయం కూడా పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఖమ్మం ముందంజ

- ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే పనిచేయాలి
- కలెక్టర్ దివాకర టీఎస్

వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శుక్రవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక సమాచార కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే ప్రభుత్వ పథకాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, బ్యాంకు రుణాల సమన్వయంతో పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. జాబ్ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, వర్షాకాలానికి ముందుగానే మొక్కలు నాటడంతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించడం, అల్పాహార కార్యక్రమం, వికలాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ వంటి కార్యక్రమాలు త్వరలో అమలులోకి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, మున్సిపల్ చైర్పర్సన్‌లు, సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత వెంకట్ రాములు కన్నుమూత

- అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఆమనగల్లు గ్రామానికి చెందిన దేశబోయిన వెంకట్ రాములు (76) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన ఆయన మరణంతో గ్రామంలో, కాంగ్రెస్ శ్రేణుల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. వెంకట్ రాములు గ్రామస్థాయి నుంచి ఎదిగి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఎమ్మెల్యే కొనియాడారు. 1985లో నకిరేకల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెంకట్ రాములు ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండేవారని తెలిపారు. గ్రామాభివృద్ధి, సామాజిక సేవలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఐపీఎల్‌కు టాటా చెప్పేసిన ఆల్‌రౌండర్..!

వేద న్యూస్ డెస్క్:

భారత ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. శుక్రవారం సామాజిక మాధ్యమ వేదికగా భావోద్వేగ సందేశం విడుదల చేసిన విజయ్ శంకర్ తన క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతున్నట్లు వెల్లడించాడు. ఐపీఎల్‌లో పలు జట్లకు ప్రాతినిధ్యం వహించిన విజయ్ శంకర్ ఆకస్మికంగా ఈ నిర్ణయం తీసుకోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. "ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాలని నిర్ణయించుకున్నాను. ఇకపై కొత్త అవకాశాలను అన్వేషిస్తూ మరింత క్రికెట్ ఆడాలనుకుంటున్నాను" అని తన సందేశంలో పేర్కొన్నాడు. తన కెరీర్‌లో అవకాశం ఇచ్చిన భారత క్రికెట్ నియంత్రణ మండలి, భారత జట్టుతో పాటు తాను ఆడిన అన్ని ఫ్రాంచైజీలకు విజయ్ శంకర్ కృతజ్ఞతలు తెలిపాడు. "దేశం తరఫున ఆడటం నా జీవితంలో గొప్ప గౌరవం. ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలు ఈ ప్రయాణంలో సంపాదించుకున్నాను" అని పేర్కొన్నాడు. 2019 ప్రపంచకప్‌లో భారత జట్టు ఆడిన 500వ వన్డే మ్యాచ్ తనకు ప్రత్యేకమని విజయ్ గుర్తుచేసుకున్నాడు. ఆ మ్యాచ్‌లో చివరి ఓవర్ వేసి తొలి బంతికే వికెట్ తీయడం జీవితాంతం గుర్తుండిపోతుందని తెలిపాడు. తన కెరీర్‌లో ఎన్నో విమర్శలు, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగానని పేర్కొన్నాడు. "సానుకూలంగా ఆలోచించండి.. కష్టపడండి.. క్రికెట్ ద్వారానే నేను జీవితాన్ని నేర్చుకున్నాను. క్రికెట్టే నా జీవితం" అంటూ భావోద్వేగంగా స్పందించాడు. తమిళనాడుకు చెందిన విజయ్ శంకర్ 2012లో రాష్ట్ర

జట్టుకు అరంగేట్రం చేశాడు. దాదాపు పదమూడు సంవత్సరాలు తమిళనాడు తరఫున ఆడిన అతడు తర్వాత త్రిపుర జట్టుకు మారాడు. 2013లో చెన్నై జట్టు తరఫున ఐపీఎల్‌లో అడుగుపెట్టిన విజయ్ అనంతరం హైదరాబాద్, ఢిల్లీ, గుజరాత్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ముఖ్యంగా 2022లో గుజరాత్ జట్టు తొలి ప్రయత్నంలోనే టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత జట్టు తరఫున విజయ్ శంకర్ 12 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అయితే ఇటీవల కాలంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో అతడికి అవకాశాలు తగ్గాయి. గత సీజన్‌లో చెన్నై జట్టులో చోటు దక్కినా నిరాశపరిచాడు. దీంతో తాజా వేలంలో ఏ జట్టూ కొనుగోలు చేయకపోవడంతో విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

పాక్ హాకీ జట్టుకు ఆర్థిక కష్టాలు

వేద న్యూస్ డెస్క్:

పాకిస్థాన్ హాకీ జట్టు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఆటగాళ్లకు సరైన నిధులు అందించడంలో పాకిస్థాన్ హాకీ సమాఖ్య విఫలమవుతుండటంతో ప్లేయర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెండింగ్ బకాయిల కోసం ఎదురుచూస్తున్న సమయంలో శిక్షణ శిబిరంలో ఇచ్చే రోజువారీ భత్యాన్ని భారీగా తగ్గించడం వివాదాస్పదంగా మారింది. ప్రాక్టీస్ శిబిరాల సమయంలో ఆటగాళ్లకు అందించే రోజువారీ భత్యాన్ని మూడు వేల పాకిస్థాన్ రూపాయిల నుంచి వెయ్యి పాకిస్థాన్ రూపాయిలకు తగ్గించినట్లు సమాచారం. భారత కరెన్సీలో ఇది సుమారు మూడు వందల ముప్పై ఐదు రూపాయలు మాత్రమే కావడంతో ప్లేయర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమకు ఇది అవమానకరమని అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ పర్యటనల సమయంలో ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి రోజుకు నూట పది డాలర్లు చెల్లిస్తామని పాకిస్థాన్ హాకీ సమాఖ్య ప్రకటించింది. అయితే గతంలో కూడా ఇలాంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదని ప్లేయర్లు ఆరోపిస్తున్నారు. తమకు రావాల్సిన బకాయిలు ఇంకా చెల్లించలేదని, ముందుగా పెండింగ్ డబ్బులు ఇచ్చిన తర్వాతే సమాఖ్య మాటలను నమ్ముతామని వారు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆగస్టు 15 నుంచి హాకీ ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. అందుకు ముందు జూన్ 13 నుంచి 27 వరకు జరిగే హాకీ ప్రో లీగ్ పోటీల్లో పాకిస్థాన్ జట్టు పాల్గొననుంది. ఈ టోర్నీలో బెల్జియం, స్పెయిన్, ఇంగ్లండ్, భారత్ జట్లతో పాకిస్థాన్ తలపడాల్సి ఉంది. ప్రపంచకప్‌కు ముందు జట్టు సన్నద్ధం కావాల్సిన సమయంలో ఆటగాళ్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడం ఆ దేశ హాకీ పరిస్థితిని ప్రతిబింబిస్తోందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

గంభీర్ నొప్పిని భరించే శక్తి అసాధారణం

వేద న్యూస్ డెస్క్:

భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ శారీరక దృఢత్వం, నొప్పిని భరించే అసాధారణ సామర్థ్యంపై మాజీ ఐపీఎల్ ఫిజియో దీపక్ సూర్య ఆసక్తికర విషయాలు వెల్లడించారు. గతంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్, బీసీసీఐ జాతీయ క్రికెట్ అకాడమీలో సేవలందించిన స్పోర్ట్స్ ఫిజియోగా పనిచేసిన ఆయన, ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో గంభీర్‌తో పాటు వీరేంద్ర సెహ్వాగ్, మహేంద్రసింగ్ ధోని, ఆశిష్ నెహ్రా వంటి ఆటగాళ్ల ఫిట్‌నెస్, రికవరీ వెనుక ఉన్న విశేషాలను పంచుకున్నారు. సాధారణంగా గాయపడిన ఆటగాళ్లు చికిత్స సమయంలో నొప్పి తగ్గించమని కోరుతుంటారని, కానీ గంభీర్ మాత్రం ఎంతటి కఠినమైన థెరపీ అయినా ఎలాంటి ఫిర్యాదు లేకుండా భరించేవాడని దీపక్ సూర్య చెప్పారు. ఒకసారి గంభీర్‌కు భుజంలో తీవ్రమైన సమస్య తలెత్తినప్పుడు వైద్యులు ఇంజెక్షన్లు సూచించినా, ఆయన మాత్రం వ్యాయామాల ద్వారానే కోలుకుంటానని పట్టుదలగా నిలిచాడని తెలిపారు. కేవలం వ్యాయామాలతోనే కోలుకోవడమే కాకుండా, ముందుకంటే మరింత బలంగా బంతిని విసిరే స్థాయికి తన భుజాన్ని తీర్చిదిద్దుకున్నాడని కొనియాడారు. మైదానంలో గంభీర్ చాలా సీరియస్‌గా కనిపించినప్పటికీ, బయట మాత్రం ఎంతో సరదాగా ఉంటాడని వెల్లడించారు. అంతర్జాతీయ క్రికెట్ డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం గురించి కూడా దీపక్ సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకసారి ప్రొఫెషనల్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్తే జీవితంలో మళ్లీ ప్రత్యేకంగా కమెడియన్లు అవసరం అనిపించదని, భారత క్రికెటర్ల వద్ద అద్భుతమైన హాస్యచతురత ఉంటుందని చెప్పారు. వీరేంద్ర సెహ్వాగ్, ఆశిష్

నెహ్రా వంటి సీనియర్ ఆటగాళ్లకు శరీర నిర్మాణం, ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకునే విధానాలపై అపారమైన అవగాహన ఉందని తెలిపారు. సెహ్వాగ్‌కు బాడీ మెకానిక్స్‌పై అసాధారణ పట్టు ఉండేదని, ఫిజియోలు పొరపాటున తప్పు కండరంపై ఒత్తిడి పెడితే సరైన ప్రదేశం ఎక్కడో ఆయనే చెప్పేవాడని గుర్తు చేసుకున్నారు. ఇక ఆశిష్ నెహ్రా అయితే గాయం వచ్చిన మొదటి రోజు నుంచే కోలుకునే వరకు ఎలాంటి రీహాబ్ ప్రణాళిక ఉండాలో ముందుగానే సిద్ధం చేసేవాడని ప్రశంసించారు. ఐపీఎల్ వంటి భారీ టోర్నీల్లో స్పోర్ట్స్ ఫిజియో బాధ్యతలు చాలా ఒత్తిడితో కూడుకున్నవని కూడా దీపక్ సూర్య వెల్లడించారు. కోట్ల రూపాయల విలువైన ఆటగాళ్లు గాయపడినప్పుడు ఫిజియో తీసుకునే ఒక్క నిర్ణయం మ్యాచ్ ఫలితాన్ని, ఆటగాడి కెరీర్‌ను ప్రభావితం చేస్తుందని చెప్పారు.

కామెంటరీ బాక్స్‌లో స్వేచ్ఛ లేదన్న శివరామకృష్ణన్

వేద న్యూస్ డెస్క్:

క్రికెట్ కామెంటరీ వెనుక ఉన్న కఠిన పరిస్థితులపై భారత మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్‌ల సమయంలో కామెంటరీ చెప్పేవారికి పూర్తి స్వేచ్ఛ ఉండదని, బయటకు కనిపించే పరిస్థితులకు భిన్నంగా కామెంటరీ బాక్స్‌లో తీవ్ర ఒత్తిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. కామెంటరీ బాక్స్‌లో కూర్చొని స్వేచ్ఛగా మాట్లాడుతున్నారని చాలామంది అభిమానులు భావిస్తారని, కానీ వాస్తవానికి అక్కడ పరిస్థితి నరకంలా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. మైక్ ఆన్ చేసే ముందు నుంచే ప్రసార సంస్థల ప్రతినిధులు, క్రికెట్ బోర్డు అధికారులు కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలు ఇస్తారని తెలిపారు. కొంతమంది ఆటగాళ్లను ఎక్కువగా విమర్శించకూడదని, వివాదాస్పద నిర్ణయాలు లేదా మైదాన పరిస్థితులపై ప్రతికూల వ్యాఖ్యలు చేయవద్దని ముందుగానే హెచ్చరిస్తారని చెప్పారు. తాము అనుకున్నది స్వేచ్ఛగా చెప్పే పరిస్థితి ఉండదని, ప్రసార సంస్థలు కోరుకున్న అభిప్రాయాలనే ఎక్కువగా చెప్పాల్సి వస్తుందని శివరామకృష్ణన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్ద ఇరవై ఓవర్ల లీగ్‌లు, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో ఈ నియంత్రణ మరింత ఎక్కువగా ఉంటోందని ఆరోపించారు. నిష్పక్షపాతంగా లోపాలను ఎత్తిచూపాలని ప్రయత్నిస్తే తదుపరి సిరీస్‌లలో అవకాశాలు తగ్గించేలా పరోక్ష హెచ్చరికలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. కెరీర్, ఆర్థిక భద్రత కోసం చాలామంది కామెంటేటర్లు ప్రసార సంస్థలు చెప్పిన విధంగానే మాట్లాడాల్సి వస్తోందని విమర్శించారు.

వేద న్యూస్

శనివారం మే 23 , 2026

'పేట్రియాట్' ఓటీటీ విడుదలకు సిద్ధం

వేద న్యూస్ డెస్క్:

మలయాళ సినీ పరిశ్రమకు చెందిన అగ్ర కథానాయకులు మమ్ముట్టి, మోహన్ లాల్ కలిసి నటించిన భారీ మల్టీస్టారర్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'పేట్రియాట్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో రూపొందిన ఈ రాజకీయ, గూఢచారి కథా చిత్రం థియేటర్లలో మంచి స్పందన దక్కించుకున్న నేపథ్యంలో డిజిటల్ విడుదలపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక జీ5 సొంతం చేసుకుంది. జూన్ 5 నుంచి ఈ చిత్రాన్ని డిజిటల్ వేదికలో ప్రసారం చేయనున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఒకేసారి ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. చాలా కాలం తర్వాత మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి తెర పంచుకోవడం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వీరితో పాటు ఫహాద్ ఫాజిల్ కీలక ప్రతినాయక పాత్రలో నటించగా, నయనతార, కుంచాకో బోబన్, రేవతి తదితరులు ప్రధాన పాత్రల్లో కనిపించారు. జాతీయ భద్రత, ప్రభుత్వ నిఘా వ్యవస్థ, అంతర్జాతీయ కుట్రల నేపథ్యంలో సాగే ఈ హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథనం, అగ్ర తారాగణం నటనతో రూపొందిన ఈ చిత్రం థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి వద్ద నుంచే ఆస్వాదించే అవకాశం పొందనున్నారు.

దిశా పఠాని ఫిట్‌నెస్ సీక్రెట్స్ ఇవే..

వేద న్యూస్ డెస్క్:

బాలీవుడ్ నటి దిశా పఠాని తన ఫిట్‌నెస్, కండరాల దృఢత్వం కోసం అనుసరించే వ్యాయామాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. తక్కువ బరువులతో ఎక్కువ రెప్స్ చేయడం కంటే, ఎక్కువ బరువులతో తక్కువ రెప్స్ చేయడం వల్ల కండరాల బలం వేగంగా పెరుగుతుందని ఆమె తెలిపింది. కేవలం బరువు తగ్గడానికే కాదు, శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు కూడా క్రమం తప్పకుండా వర్కవుట్స్ చేయడం ఎంతో అవసరమని పేర్కొంది. దిశా ప్రకారం, కండరాల పెరుగుదల మరియు అప్పర్ బాడీ బలం కోసం "షోల్డర్ ప్రెస్" అత్యుత్తమ వ్యాయామాల్లో ఒకటి. ఈ వ్యాయామాన్ని నిల్చుని లేదా కూర్చుని చేయవచ్చని ఆమె చెప్పింది. రెండు చేతుల్లో డంబెల్స్ పట్టుకుని చేతులను పైకి ఎత్తి మళ్లీ కిందికి దించుతూ చేసే ఈ వ్యాయామం భుజాలు, చేతులు, కోర్ మజిల్స్‌పై మంచి ప్రభావం చూపిస్తుందని వివరించింది. అలాగే, హెవీ వర్కవుట్స్‌కు ముందు వామప్ చేయడం తప్పనిసరి అని దిశా సూచించింది. ఏరోబిక్ వ్యాయామాలు, స్ట్రెచింగ్‌లతో శరీరాన్ని ముందుగా సిద్ధం చేయడం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత సరిగ్గా నియంత్రణలో ఉంటాయని తెలిపింది. దీంతో గాయాల ప్రమాదం కూడా తగ్గుతుందని పేర్కొంది. పర్ఫెక్ట్ యాబ్స్ కోసం "క్రంచెస్" ఎంతో ఉపయోగపడతాయని ఆమె చెప్పింది. మ్యాట్‌పై పడుకుని మోకాళ్లను పైకి ఎత్తి, చేతులను తల వెనుక ఉంచుకుని నెమ్మదిగా పైకి లేస్తూ చేసే ఈ వ్యాయామం పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుందని వివరించింది. క్రమం తప్పకుండా ఈ వ్యాయామం చేయడం వల్ల కడుపు భాగం దృఢంగా మారుతుందని తెలిపింది. ఫిట్‌నెస్ ప్రయాణంలో "సెల్ఫ్ మోటివేషన్" చాలా ముఖ్యమని దిశా పఠాని అభిప్రాయపడింది. ప్రతి రోజు చేసే వ్యాయామాలను ఫోటోలు లేదా వీడియోల రూపంలో రికార్డ్ చేసుకుంటే, కాలక్రమంలో శరీరంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపిస్తాయని చెప్పింది. అవే మరింత కష్టపడేందుకు ప్రేరణ ఇస్తాయని తెలిపింది. మహిళలు బరువులు ఎత్తితే మగవారిలా మారిపోతారనేది పూర్తిగా అపోహ మాత్రమేనని దిశా స్పష్టం చేసింది. సరైన శిక్షణ, సరైన ఆహారంతో హెవీ వర్కవుట్స్ చేయడం వల్ల మహిళలు మరింత ఫిట్‌గా, బలంగా మారతారని పేర్కొంది. క్రమశిక్షణతో వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవనశైలిని సులభంగా సాధించవచ్చని సూచించింది.

'పెద్ది' పాట ప్రోమోకు భారీ స్పందన

వేద న్యూస్ డెస్క్:

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమోలో రామ్ చరణ్, శృతి హాసన్ వేసిన ఉత్సాహభరితమైన స్టెప్పులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. విడుదలైన కొద్ది సేపటికే ఈ ప్రోమో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పూర్తి పాటను మార్చి 23న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రత్యేక గీతానికి ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. రెహమాన్ సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఇక ఈ పాటలో మరో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయాన్ని మాత్రం చిత్రబృందం గోప్యంగా ఉంచింది. దీంతో అభిమానుల్లో ఆసక్తి, ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు "హెల్లల్లలో" పాటతో మరింత చర్చనీయాంశంగా మారింది.

'నేనొక్కడినే' రీ-రిలీజ్‌కు భారీ రెస్పాన్స్

వేద న్యూస్ డెస్క్:

టాలీవుడ్‌లో ప్రస్తుతం రీ-రిలీజ్ చిత్రాల హవా కొనసాగుతోంది. కొత్త పెద్ద సినిమాల విడుదలలు తగ్గిన ఈ సమ్మర్ సీజన్‌లో స్టార్ హీరోల క్లాసిక్ చిత్రాలను మళ్లీ థియేటర్లలో చూడాలని అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటించిన కల్ట్ సైకాలజికల్ థ్రిల్లర్ '1 నేనొక్కడినే' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. చిత్రాన్ని అత్యాధునిక 4కే అల్ట్రా హెచ్‌డీ సాంకేతికతతో, డాల్బీ నాణ్యత గల శబ్ద వ్యవస్థతో ప్రపంచవ్యాప్తంగా ఘనంగా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని మే 31న ఈ చిత్రాన్ని తిరిగి విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రత్యేక 4కే ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ట్రైలర్‌లో మహేశ్ బాబు స్టైలిష్ లుక్, యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా చిన్న మహేశ్ పాత్రలో కనిపించిన గౌతమ్ ఘట్టమనేని సన్నివేశాలు అభిమానుల్లో ప్రత్యేక భావోద్వేగాన్ని కలిగిస్తున్నాయి. దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం 2014 సంక్రాంతి సందర్భంగా విడుదలై తెలుగు ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని అందించింది. సాధారణ వాణిజ్య చిత్రాల శైలికి భిన్నంగా మానసిక ఉత్కంఠ, మైండ్ గేమ్ కథనం, క్లిష్టమైన కథా నిర్మాణంతో తెరకెక్కిన ఈ సినిమా అప్పట్లో ప్రేక్షకులకు పూర్తిగా అర్థం కాకపోయినా, కాలక్రమేణా కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు పొందింది. ముఖ్యంగా మహేశ్ బాబు నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగాలు ఇప్పటికీ అభిమానులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన బాలీవుడ్ నటి కృతి సనన్ కథానాయికగా నటించింది. ఆమెకు ఇదే తొలి తెలుగు సినిమా కావడం విశేషం. అలాగే మహేశ్ బాబు తనయుడు గౌతమ్ ఘట్టమనేని చిన్ననాటి హీరో పాత్రలో కనిపించి ప్రేక్షకులను మెప్పించాడు. కుటుంబ భావోద్వేగాలతో పాటు సస్పెన్స్ అంశాలను సమతూకంగా మిళితం చేసిన తీరు సినిమాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఎ14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. 'హూ ఆర్ యూ', 'లండన్ బాబు', 'ఓ సయ్యాన్' వంటి పాటలు అప్పట్లోనే కాక ఇప్పటికీ అభిమానులను అలరిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో రీ-రిలీజ్ సినిమాలకు భారీ స్పందన లభిస్తోంది. గతంలో విడుదలైన అనేక స్టార్ హీరోల చిత్రాలు మళ్లీ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడిన నేపథ్యంలో '1 నేనొక్కడినే'పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా మహేశ్ అభిమానులు ఈ రీ-రిలీజ్‌ను పండుగలా జరుపుకునేందుకు ఇప్పటికే ప్రత్యేక ప్రదర్శనలు, అభిమాన వేడుకలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎసినిమా విడుదల సమయంలో పూర్తిగా అర్థం కాలేదని భావించిన చాలామంది ప్రేక్షకులు ఇప్పుడు కొత్త కోణంలో ఈ చిత్రాన్ని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక సాంకేతిక నాణ్యతతో మరోసారి వెండితెరపైకి రానున్న '1 నేనొక్కడినే' ఈసారి మరింత గొప్ప స్పందన అందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభాస్ వినయానికి ఫిదా అయిన వివేక్ ఒబెరాయ్

వేద న్యూస్ డెస్క్:

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు. అభిమానుల అంచనాలకు తగ్గట్టుగా విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న ఆయన, ఒకేసారి పలువురు దర్శకులతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ప్రస్తుతం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్'తో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజి' చిత్రాల్లో ప్రభాస్ నటిస్తున్నారు. ఈ రెండు సినిమాల చిత్రీకరణలు సమాంతరంగా కొనసాగుతుండటంతో ప్రభాస్ తన సమయాన్ని ఎంతో క్రమబద్ధంగా నిర్వహిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇలాంటి సమయంలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ప్రభాస్ గురించి చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన వివేక్ ఒబెరాయ్.. ప్రభాస్ ఎంత పెద్ద స్టార్ అయినప్పటికీ ఆయనలో ఏమాత్రం గర్వం ఉండదని అన్నారు. షూటింగ్ సమయంలో తీవ్ర ఎండలు ఉన్నా అలసట చూపకుండా ఎంతో అంకితభావంతో పనిచేస్తారని ప్రశంసించారు. సెట్‌లో పనిచేసే ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తారని వివేక్ తెలిపారు. ముఖ్యంగా తన బృందం కోసం ప్రత్యేకంగా రుచికరమైన వంటకాలు తీసుకువచ్చి అందరితో పంచుకుంటారని చెప్పారు. సహజ స్వభావం, సరళమైన వ్యవహారం కారణంగా ప్రభాస్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రాజాసాబ్ హీరోయిన్ హల్‌చల్

వేద న్యూస్ డెస్క్:

దక్షిణాది చిత్రసీమలో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మాళవిక మోహనన్ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారుతున్నారు. వరుస భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటూ స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఆమె, ఇప్పుడు ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ది రాజా సాబ్' ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుండటంతో మరింత చర్చనీయాంశంగా నిలిచారు. 1993 ఆగస్టు 4న కేరళలోని కన్నూర్‌లో జన్మించిన మాళవిక, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు. మోహనన్ కుమార్తె. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ సరసన 'పట్టం పోల్' చిత్రంతో ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత హిందీలో ప్రముఖ దర్శకుడు మజీద్ మజీదీ తెరకెక్కించిన 'బియాండ్ ది క్లౌడ్స్' చిత్రంలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. తమిళ చిత్రసీమలో మాత్రం మాళవిక కెరీర్‌కు భారీ మలుపు తిరిగింది. సూపర్ స్టార్ రజనీకాంత్‌తో 'పెట్టా', స్టార్ హీరో విజయ్‌తో 'మాస్టర్' చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత 'తంగలాన్', 'యుద్ధ', 'హృదయపూర్వం' వంటి చిత్రాలతో తన నటనకు మరింత ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'ది రాజా సాబ్' చిత్రంలో నటించడం ద్వారా మాళవిక టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే ఆమె పాత్రపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇదిలా ఉంటే, మాళవిక చేతిలో ప్రస్తుతం మరిన్ని భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. కార్తి సరసన నటించిన 'సర్దార్ 2', దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న 'పాకెట్ నవల' చిత్రాలు కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. విభిన్న భాషల్లో నటిస్తూ, తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మాళవిక మోహనన్ దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా మరింత బలమైన స్థానం సంపాదించుకుంటున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073